
# పసిడి రుణాలకు కళ్లెం!

## నిబంధనలను కఠినతరం చేసే యోచనలో రిజర్వుబ్యాంక్



న్యూఢిల్లీ, మార్చి 7: పసిడి రుణాలకు కళ్లెం వేయడానికి రిజర్వు బ్యాంక్ సిద్ధమవుతున్నది. ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటున్న గోల్డ్ లోన్లకు చెక్ పెట్టడానికి త్వరలో కఠిన నిబంధనలను అమలులోకి తేవాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు జారీ చేస్తున్న గోల్డ్ లోన్లపై నిఘా పెట్టాలని సూచించింది. గోల్డ్ లోన్ తీసుకున్నవారు ఈ నిధులను దేనికి వినియోగిస్తున్నారు.. అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు సూచించింది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన సెంట్రల్ బ్యాంక్.. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే రుణాలు అత్యధికంగా తీసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాలు వారు దేనికి వినియోగిస్తున్నారన్న విషయంపై మానిటర్ చేయాలని సూచించింది. రుణాలు తీసుకున్నవారి కుటుంబ వివరాలు, పసిడి వారిదేనా లేకపోతే ఇతరవారు వీరిపై తీసుకుంటున్నారా అనేదానిపై సమాచారం సేకరించాలని పేర్కొంది. ఇటీవలకాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి పేరుమీద తీసుకొని ఇతర పెట్టుబడులు పెడుతున్నారనే సమాచారం ఆధారంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించనియెడల ఈ బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది.

**ఆరు నెలల్లో 50 శాతం వృద్ధి**

పసిడి తాకట్టుపై రుణాలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సెంట్రల్ బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పసిడి రుణాలు 50 శాతం పెరిగాయి. పసిడి వినిమయంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో గోల్డ్ లోన్లకు అత్యధిక మంది ఆకర్షితులవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. గడిచిన 12 నుంచి 16 నెలల మధ్యకాలంలో నాన్-బ్యాంకింగ్ సంస్థలు జారీ చేసిన గోల్డ్ లోన్లపై ఆర్బీఐ ఆడిటింగ్ నిర్వహించగా, దీంట్లో ఎన్నో అనుమానాలు తలెత్తాయని, తీసుకున్నవారిలో సగానికి పైగా మంది వేరే అవసరాలకు వినియోగించారనే అనుమానం వ్యక్తంచేసింది.

# ఐఐటీ హైదరాబాద్‌తో కోలిండియా జట్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, ఉద్గార రహిత బొగ్గు, ఇంధనాలపై పరిశోధనలకోసం ఐఐటీ హైదరాబాద్‌తో కోల్ ఇండియా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.98 కోట్ల గ్రాంట్‌తో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో(క్లీన్జ్) సంస్థను ఐఐటీహెచ్‌లో నెలకొల్పేందుకు ఇరు సంస్థలు జట్టుకట్టాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి సమక్షంలో కోలిండియా సీఎండీ పీఎం ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర బీఎస్ మూర్తిలు పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ వృద్ధికి బొగ్గురంగం అతి ముఖ్యమైనదని, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన వనరుగా కొనసాగుతున్న గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదన్నారు.

**ఉత్పాదక వ్యయం తగ్గాలి: సింగరేణి సీఎండీ బలరాం**

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే సంక్షేమం సాధ్యమని, ఉద్యోగుల పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణిభవన్‌లో 38వ స్ట్రక్చర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి బొగ్గు విక్రయ ధరలు కోల్ ఇండియా, విదేశీ బొగ్గు కన్నా అధికంగా ఉన్నాయని, దీంతో ఈ బొగ్గుకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నదని, ఇది ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. బొగ్గు ఉత్పాదక వ్యయం రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందన్నారు.


**పెన్షన్ మొత్తాన్ని పెంచండి**

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాంలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు రామచందర్‌రావు తెలిపారు.

# కొలువులు ఆగమాగం

**అన్ని రంగాలకూ ట్రంప్ సుంకాల సెగ • ఆందోళనలో ఉద్యోగుల భవిష్యత్తు**

**ఇప్పటికే మందగమనంలో దేశ జీడీపీ వృద్ధి • గుబులు పుట్టిస్తున్న కొత్త సవాళ్లు**



న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా అధ్యక్షుడి పోకడ.. ఆయా దేశాల్లో పెద్ద ఎత్తునే ఉద్యోగుల ఉసురు తీసేలా ఉన్నది. ఆ జాబితాలో భారత్ కూడా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అవును.. ఇప్పటికే ద్రవ్యోల్బణం, తయారీసహా కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు మందగమనం, అధిక వడ్డీరేట్ల వంటి సమస్యలతో సతమతమవుతున్న దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై సుంకాలుంటాయంటున్న ట్రంప్ ప్రకటనలు నిజమైతే.. ఇండస్ట్రీ కుదేలవడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ముఖ్యంగా భారతీయ తయారీ, ఎగుమతుల రంగాలకు గట్టి ఎదురుదెబ్బేనంటున్నారు.



## జాబ్ మార్కెట్ మటాష్!

*ఇటీవలికాలంలో జాబ్‌మార్కెట్ అల్లకల్లోలంగానే తయారైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) దెబ్బకు ఉద్యోగావకాశాలు భారీగానే కోల్పోవాల్సి వస్తున్నది. దీనికితోడు దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా కొత్త నియామకాలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలను పెంచితే.. ఆ ప్రభావం అక్కడి మార్కెట్‌లో మన వస్తువులకున్న డిమాండ్‌ను తప్పక ప్రభావితం చేయగలదు. ఇదే జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి ఎగుమతులు పడిపోయి.. ఉత్పత్తి మందగిస్తుంది. దాంతో అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులేనన్నది మార్కెట్ నిపుణుల విశ్లేషణ. నిజానికి కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే మార్కెట్ కోలుకుంటున్నది. ఈ సమయంలో ట్రంప్ సుంకాల పిడుగు అంగట్లో గట్టిగానే అలజడులను సృష్టిస్తున్నదని చెప్పవచ్చు.*

**ఇదీ సంగతి..**

'ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే దూరం' అంటున్నారు యూఎస్ బాస్ ట్రంప్. దీంతో ఆయా రంగాల్లో ఇప్పుడు అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు తగ్గట్టుగా భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా సుంకాలను వేయనున్నది. భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ విషయానికే వస్తే.. ట్రంప్ సుంకాల ప్రభావం దీనిపై భారీగానే ఉండే వీలున్నది. ప్రస్తుతం భారతీయ నగలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో అక్కడికి మన ఎగుమతులు భారీగానే జరుగుతున్నాయి. అయితే సుంకాలు పెంచితే వీటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. దాంతో వ్యాపారాలకు దెబ్బే. అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న జ్యూయెల్లరీపై వాటి విలువలో కేంద్ర ప్రభుత్వం 20 శాతాన్ని సుంకాలుగా వసూలు చేస్తున్నది. కానీ భారత్ నుంచి అమెరికాకు చేరుతున్న నగలపై అక్కడ పడుతున్నది గరిష్ఠంగా 5.5-7 శాతమే. ఇక సానబెట్టిన వజ్రాలపై ఇక్కడ 5 శాతం సుంకం పడితే.. అమెరికాలో ఏమీ లేదు. ఈ లెక్కన ట్రంప్ హెచ్చరించినట్టుగా సుంకాలు పడితే జెమ్స్ అండ్ జ్యూయెల్లరీ ఇండస్ట్రీ కుదేలైనట్టే. దేశంలో 2 లక్షలకుపైగా జనాభా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నది. వీరిలో మహిళలే ఎక్కువ. ఇప్పుడు టారిఫ్‌ల సెగ వీరందరికీ తగులుతున్నట్టే. ఇలాగే అనేక రంగాల పరిస్థితి నెలకొన్నది.

**ఐటీ రంగానికీ తిప్పలే**

భారతీయ ఐటీ రంగానికున్న ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. అయితే తొలిసారి అగ్రరాజ్య అధ్యక్షుడైనప్పుడే దేశీయ ఐటీ రంగాన్ని ట్రంప్ తీవ్రంగా దెబ్బతీశారు. వీసా నిబంధనలు కఠినతరం, ప్రాజెక్టుల్ని దూరం చేయడం, అమెరికాలో అమెరికన్లతోనే పనిచేయించాలనడం వంటివి ఇండియన్ ఐటీ ఇండస్ట్రీకి ఇబ్బందుల్ని తెచ్చిపెట్టాయి. ఇక్కడి ఐటీ ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేశాయి. అమెరికాలోనూ భారతీయులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. మళ్లీ ఇప్పుడు ట్రంప్ రావడంతో ఐటీ రంగంలోనూ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఇప్పటికే ఏఐ దెబ్బకు రిక్రూట్‌మెంట్లు మందగించిన విషయం తెలిసిందే. మొత్తానికి ట్రంప్.. ప్రధాని మోదీకి మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ.. దేశ ప్రయోజనాలే ముందు అంటున్నారు ట్రంప్. నిజానికి అమెరికా మోటర్‌సైకిళ్లు, విస్కీలపై 20 నుంచి 50 శాతం మేర సుంకాలను కేంద్రం తగ్గించింది. మరికొన్నింటిపైనా సమీక్ష జరుపుతున్నది. మరోవైపు వాణిజ్య మంత్రి గోయల్ అమెరికాలో చర్చల కోసం వెళ్లారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయో చూడాల్సిందే.

| సుంకాలతో ఇబ్బందులు | ప్రభావిత రంగాలు | ఉపశమనం ఎలా? |
|---|---|---|
| • భారంగా ఎగుమతుల ఖర్చులు | • రత్నాలు, ఆభరణాలు | • తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు |
| • పడిపోనున్న మార్కెట్ వాటా | • ఫార్మా ఇండస్ట్రీ | • పరిశ్రమలకు పన్ను మినహాయింపులు |
| • తయారీ రంగం కుదేలు | • ఉక్కు, అల్యూమినియం | • సులభంగా రుణ లభ్యత |
| • ఉద్యోగుల తొలగింపులు | • టెక్స్‌టైల్స్ పరిశ్రమ | • విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు |
| • ఆర్థిక వ్యవస్థలో మందగమనం | • ఎలక్ట్రానిక్స్ | • వినియోగదారుల కొనుగోలు శక్తి బలోపేతం |

- *టారిఫ్‌ల దెబ్బకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 2 నుంచి 7 బిలియన్ డాలర్ల మేర పడిపోయే అవకాశం ఉందంటున్న ఇండియా రేటింగ్స్.*
- *ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్‌లో అమెరికాకు భారత ఎగుమతులు గతంతో పోల్చితే 5.57 శాతం పెరిగి 59.93 బిలియన్ డాలర్లుగా నమోదు. అమెరికా నుంచి దిగుమతులు కూడా 1.91 శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరిక.*
- *అమెరికా పెంచే సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు 5 నుంచి 10 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్న ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్.*

## మహిళలకు ఎస్బీఐ చౌక రుణాలు

**'నారీ శక్తి' డెబిట్ కార్డు పరిచయం**

ముంబై, మార్చి 7: ఔత్సాహిక మహిళా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని శుక్రవారం ఎస్బీఐ ప్రకటించింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో 'అస్మిత' పేరిట ఈ ప్రత్యేక లోన్లకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం శ్రీకారం చుట్టింది. బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు వేగంగా, సులభంగా ఈ రుణాలను అందజేస్తామన్నారు. ఇదిలావుంటే 'నారీ శక్తి' ప్లాటినమ్ రూపే డెబిట్ కార్డునూ ఎస్బీఐ ఈ సందర్భంగా తీసుకొచ్చింది.

**బీవోబీ నయా అకౌంట్స్**

ప్రవాస భారతీయ మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం 'బోవోబీ గ్లోబల్ వుమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్వో సేవింగ్స్ అకౌంట్'ను అందుబాటులోకి తెచ్చింది. గృహ, వాహన రుణాలపై చౌక వడ్డీ, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు, లాకర్ అద్దెపై 100 శాతం రాయితీ, ఎయిర్‌పోర్టుల్లో ఉచితంగా దేశీయ, అంతర్జాతీయ లాంజ్ సౌకర్యం పొందేలా కస్టమైజ్డ్ డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ఈ ఖాతాదారులకుంటాయి.

## ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక క్లస్టర్లు

**రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకుగాను ఎంఎస్ఎంఈలకోసం ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎఫ్‌టాప్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో 'ఎంఎస్ఎంఈ స్పార్క్-2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

## బైక్ దొంగల కోసం ముమ్మర గాలింపు

- కూపీ లాగుతున్న ప్రత్యేక టీం
- పోలీసుల అదుపులో బైక్ మైనర్ దొంగ

నవీపేట, మార్చి 7: మండల కేంద్రంలో బైక్ దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. 12 రోజుల్లో ఎనిమిదికి పైగా బైకులు చోరీకి గురయ్యాయి. వరుస బైక్ దొంగతనాలను జిల్లా పోలీస్ యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక ఎస్సై వియ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం రంగంలోకి దిగింది. వారం రోజులుగా మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో దొంగల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టింది.

**పోలీసుల అదుపులో మైనర్ నిందితుడు**

మండల కేంద్రంలో గత నెల25న బైక్‌ను చోరీ చేసిన మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసకున్నట్లు సమాచారం. బోధన్ మండలం ఊట్‌పల్లికి చెందిన మాతంగి మహేందర్‌కు చెందిన బైక్ ఫిబ్రవరి 24న నవీపేటలో చోరీకి గురైంది. మహంతం గ్రామానికి చెందిన 16 ఏండ్ల యువకుడు బైకును చోరీ చేసి నవీపేటలోని కిరాయి ఇంట్లో గల డాబాపై దాచి పెట్టాడు. నిందితుడి కుటుంబం బతుకు దెరువుకోసం మండల కేంద్రానికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నది. సదరు మైనర్ హైదరాబాద్‌లో క్యాటరింగ్ చేస్తుంటాడు. ఇటీవల నవీపేటకు కుటుంబ సభ్యుల వద్దకు వచ్చి మహేందర్‌కు చెందిన బైక్‌ను చోరీ చేశాడు. ఇరుగు పొరుగు వారు బైకును గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గాలింపు చేపట్టి చోరీకి గురైన బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగతతా బైకుల చోరీతో ఈ మైనర్ దొంగకు సంబంధం లేదని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

## నల్లాలకు బిగించిన మోటర్లు సీజ్




నల్లాలకు బిగించిన మోటర్లను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

భీమ్‌గల్, మార్చి 7: తాగునీటి పైప్‌లైన్ నుంచి ఎక్కువ నీటిని తీసుకోవాలనే ఉద్దేశంతో కొందరు అక్రమంగా తాగునీటి కుళాయిలకు బిగించిన మోటర్లను గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం సీజ్ చేసి గ్రామపంచాయతీకి తరలించారు. గ్రామకార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎనిమిది మోటర్లను స్వాధీనం చేసుకున్నామని, ఎవరైనా నల్లాలకు మోటర్లు బిగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

మోర్తాడ్, మార్చి7: నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో, గ్రామపంచాయతీలో కార్మికులు చేసే పని ఒకటే అయినా వేతనాల్లో తేడా ఎందుకు ఉంచారని అధికారులను ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా నాయకులు సత్తెక్క, గజనాథ్, దశరత్, దయాల్‌సింగ్, మజీద్, రాజేశ్వర్, దుర్గయ్య, నర్సయ్య, సువర్ణ, గంగాధర్, చిన్న సాయన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యేల పుట్టిన రోజు వేడుకలు



బోధన్ బస్టాండ్‌లో భోజనం, పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ యువ నాయకులు



మాక్లూర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తేతెలంగాణ యంత్రాంగం, మార్చి7: బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితోపాటు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమేర్ అహ్మద్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల పార్టీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం మొక్కనాటారు. పట్టణ యువకుల రక్తదానం చేసి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. బోధన్‌లో మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు భోజనం, పండ్లు, స్వీట్స్, వాటర్ బాటిళ్లను అందించారు. ఎడపల్లిలోని మంగళ్‌పాడ్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బోధన్ మండలంలోని ఆచన్‌పల్లి శివారులో షకీల్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆర్మూర్ నవనాథ సిద్దేశ్వర శివాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాక్లూర్‌లో బీఆర్ఎస్ సంబురాలు నిర్వహించారు.



ఆర్మూర్‌లో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు



నగరంలో రక్తదానం చేస్తున్న యువకులు



బోధన్ మండలం ఆచన్‌పల్లి గ్రామశివారులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఎడపల్లిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# రెండు టిప్పర్లు, జేసీబీ సీజ్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



సోమేశ్వర్‌లో మొరం తవ్వకాలపై దాడులు నిర్వహిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్, మార్చి 7 : అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో దర్జాగా మొరం దందా శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మైన్స్ అధికారులు స్పందించారు. బాన్సువాడ మండలంలోని స్టోన్ క్రషర్ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను మైన్స్ అధికారులు పట్టుకొన్నారు. మధ్యాహ్నం బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ సోమేశ్వర్ గ్రామంలోని వాసుదేవుపల్లి శివారులో మొరం నింపుకొని వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకోగా, రాత్రి మైన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి సోమేశ్వర్, కొల్లూర్ గ్రామ శివారులో పర్యటించారు. మొరంను తవ్వుతున్న జేసీబీని వాల్టా చట్టం కింద సీజ్ చేసినట్లు తెలిపారు. రెండు టిప్పర్లను పోలీస్‌లకు అప్పగించినట్లు మైన్స్ ఏడీ నగేశ్ తెలిపారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

ధర్పల్లి, మార్చి 7 : మండల కేంద్రంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా అదనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్ జాడే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్ గౌతమ్, లైన్‌మన్ అశోక్‌కుమార్, వీడీసీ చైర్మన్ గంగరాజం, వైస్‌చైర్మన్ సాయిలు, సభ్యులు గంగాధర్, రవి, రాజు, శ్రీను, రాజేశ్వర్, యాకుబ్, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఏడీ ఉత్తమ్ జాడే

## జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు



వాడి వాగులో పట్టపగలే ఇసుకను తోడుతున్న పొక్లెయిన్

ధర్పల్లి, మార్చి 7 : మండలంలోని వాడి గ్రామ పరిధిలో ఉన్న పెద్దవాగులో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టపగలే పొక్లెయిన్‌తో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయమై ఆర్ఐ రాజేశ్వర్‌ను వివరణ కోరగా.. తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, ఇసుక అక్రమ తవ్వకాలు తమ దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆర్టీసీ బస్సులో బంగారు గొలుసు చోరీ

వినాయక్‌నగర్, మార్చి 7 : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి నుంచి బంగారు మంగళసూత్రం చోరీకి గురైంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలానికి చెందిన చెలిమెల వర్షిణి గుత్ప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు గురువారం నిజామాబాద్‌కు వచ్చింది. నిజామాబాద్ బస్టాండ్‌లో ఆర్మూర్ బస్సు ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో మెడలోని రెండు తులాల బంగారు గొలుసును బ్యాగ్‌లో పెట్టుకున్నది. బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, మార్చి 7 : నిజామాబాద్ సౌత్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్ పోస్ట్, వాచ్ ఉమెన్, స్ట్రీట్ వాచ్ ఉమెన్, వంటమనిషి (హెడ్‌కుక్) ఒక్కో పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తరగతి మెమో, బోనాఫైడ్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో వినాయక్‌నగర్‌లోని స్వరూప రెసిడెన్సీ వెనుక భవనంలో ఈనెల 8 నుంచి 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492580760 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## కొనసాగుతున్న పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

- పన్ను చెల్లించని ఏడు దుకాణాలు సీజ్



దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కంఠేశ్వర్, మార్చి 7 : నగరంలోని పన్ను వసూలు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ శనివారం పర్యటించి, పలు వాణిజ్య సముదాయాలు, రైస్‌మిల్లులు తనిఖీ చేశారు. ఖానాపూర్ ఏరియాలోని పలు రైస్‌మిల్లులు తనిఖీ చేసిన ఆయన.. పెండింగ్‌లో ఉన్న పన్ను చెల్లించాలని సూచించారు. వినాయక్‌నగర్‌లో పన్ను చెల్లించని ఏడు షాపులను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.